కార్పొరేట్ సెలూన్లకు అనుమతులివ్వొద్దు



డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అల్వాల్ : అల్వాల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని కార్పొరేట్ సెలూన్‌లకు తెరవడానికి అనుమతి ఇవ్వొద్దని అల్వాల్, కంటోన్మెంట్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కోరారు. గురువారం అల్వాల్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో అల్వాల్, కంటోన్మెంట్ పరిధి ప్రాంతాల్లో కార్పొరేట్ సెలూన్లకు అనుమతులివ్వొద్దని అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్వాల్, కంటోన్మెంట్ ప్రాంతాల్లో నివసించేవారమని, కరోనాతో తమ వ్యాపారం దయనీయంగా ఉందని వాపోయారు. కార్పొరేట్ సెలూన్ రావడంతో తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు బిబి. అశ్విన్, రవి, శ్రావణ్, బాలంబి, బ్రహ్మం, ప్రవీణ్, శ్రీనివాస్, నరసింహా, మల్లికార్జున్, హనుమంతు తదితరులున్నారు.

బోనాలకు సౌకర్యాలు కల్పించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో ఆలయ నిర్వాహకులు

అల్వాల్ : మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీనగర్ శ్రీ ఉజ్వల భూలక్ష్మమ్మ ఆలయ నిర్వాహకులు గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా త్వరలో మహాత్మాగాంధీనగర్‌లో బోనాలు జరగనున్నాయని, బోనాల వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యేలను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. రోడ్లకు మరమ్మతులు, లైటింగ్, తాత్కాలిక టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



జెర్సీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 3, 4న జాతీయస్థాయి త్రోబాల్ పోటీలు బెంగుళూర్‌లో జరగనున్న నేపథ్యంలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటగాళ్ల జెర్సీలను గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే తెలిపారు. సౌత్ జోన్ త్రోబాల్ సెక్రటరీ జగన్‌మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌చారి తదితరులున్నారు.

రోటరీ క్లబ్ సేవలను విస్తరిస్తాం



బ్లడ్ అప్‌గ్రేడ్ యూనిట్ కేంద్రాన్ని ప్రారంభించిన శరత్‌చౌదరి తదితరులు

మల్లాపూర్ : రోటరీ క్లబ్ సేవలను మరింతగా విస్తరిస్తామని డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. గురువారం నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు అనిత పాటి బండ్ల తన సొంత నిధులు రూ.2,08,000లతో అధునాతన నూతన యంత్రాలను అందజేశారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్త యంత్రాల యూనిట్‌ను (బ్లడ్ అప్‌గ్రేడ్ యూనిట్) డిస్ట్రిక్ గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోగికి అత్యవసర సమయంలో రక్తం, ప్లేట్స్, ప్లాస్మాను అప్పటికప్పుడు ఈ నూతన యంత్రాల యూనిట్ ద్వారా రక్తాన్ని శుద్ధిచేసి రోగుల ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ఆసుపత్రికి నూతన యంత్రాలను అందజేయడం అభినందనీయమన్నారు. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరిండెంటెండ్ డాక్టర్ కమల, రాంప్రసాద్, డాక్టర్, శ్రీనివాస్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి పావని,ఆర్ఎంఓలు శ్వేత, వీణారాణి, వేణుకుమార్, వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

మల్లాపూర్ : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని మల్లాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మల్లాపూర్ జేఎస్ఎన్‌యూఆర్ఎంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి మట్లాడుతూ.. తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశావర్కర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు మమత, నాగరాణి, బిందు, వాణి, దేవకరుణ తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం



మౌలాలి : వర్షాలతో ముంపునకు గురవుతున్న షాదుల్లానగర్‌లో 450 దయా ఆర్‌సీసీ పైపులైన్ పనులను మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ప్రతి వర్షానికి ఎగువ నుంచి ఇళ్లలోకి వరదనీరు వచ్చే షాదుల్లానగర్ వాసులకు ఈ పైపులైన్‌తో ఊరట లభించనుంది. సుమారు రూ.24 లక్షల ఆర్‌సీసీ పైపులైన్ గతేడాది జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి కార్పొరేటర్ కోరిక మేరకు మంజూరు చేయించామని, పైపులైన్ పనులు ప్రారంభించడంపై కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కల్వర్టు పనులను ప్రారంభించిన మేయర్ తోటకూర అజయ్‌యాదవ్

బోడుప్పల్ : ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. రూ. 16 లక్షలతో గురువారం ద్వారకానగర్ కల్వర్ట్ పనులకు డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజా రవాణా సౌకర్యానికి కృషి చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కమిషనర్ రామలింగం, డీఈ చిరంజీవి, కార్పొరేటర్లు లతారాంచంద్రారెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శారదకిషన్‌చారి, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు సమతాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్‌రెడ్డి, నేతలు శేఖర్ రెడ్డి, పొన్నం తరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ రిటైర్డ్ ఏసీపీకి డాక్టరేట్



డా.శంకర్

ఉప్పల్ : కేంద్రీయ విద్యాలయాల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ.. అసిస్టెంట్ కమిషనర్‌గా పదవీవిరమణ పొందిన రామిశెట్టి శంకర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఆయన చేసిన పరిశోధనలకు ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కేంద్రీయ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులకు కంప్యూటర్ అవర్నెస్, కమ్యూనికేషన్ టెక్నాలజీల్లో వారికున్న అవగాహన అంశంపై ఆయన చేసిన కృషికి డాక్టరేట్ వరించింది.

యువతి అదృశ్యం



వైష్ణవి

మల్కాజిగిరి: యువతి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందినఎ వైష్ణవి (26) ప్రైవేటు ఉద్యోగిని. గతనెల 30న మల్కాజిగిరిలోని ఓ హోటల్‌కు బంధువులైన చిన్నారులతో కలిసి వచ్చింది. కొంతసేపటి తర్వాత వారిని ఆటోలో ఇంటికి పంపిన ఆమె తెలిసిన వాళ్లతో మాట్లాడి తర్వాత వస్తానని వారికి చెప్పింది. ఆ రోజు రాత్రి వరకు ఆమె ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌కు వద్దు !

మేడ్చల్ చెత్త తరలింపుపై వ్యతిరేకత
- జవహర్‌నగర్ జనం బెంబేలు
- కొత్త పాయింట్‌ను చేర్చొద్దని విజ్ఞప్తి

కాప్రా : మహానగరంలోని చెత్తను చేర్చుతున్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ఇప్పటికే జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు కూడా జవహర్‌నగర్‌కే తరలిస్తే సమీప కాలనీలు ఖాళీ చేసే పరిస్థితి వస్తుందని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

మావి జీవితాలు కాదా..
మేం ఇక్కడ బతకొద్దా..

మేడ్చల్ పరిధిలోని అత్వెల్లి డంపింగ్‌తో అక్కడి సమీపం పంట పొలాలు దెబ్బతింటున్నాయని, కాలనీలు విస్తరిస్తుండటంతో ఇళ్ల మధ్య డంపింగ్ యార్డు ఉంటుందని అక్కడి నుంచి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమీపంలోని కాలనీతో పాటు కాప్రా సర్కిల్ పరిధి వాసులు బెంబేలెత్తిపోతున్నారు. 'అక్కడి ప్రజల మేలు కోసం డంపింగ్ యార్డును ఇక్కడికి తరలిస్తున్నారు. మావి జీవితాలు కావా.. ' ? 'మేము మనుషులం కాదా '.. అని ప్రశ్నిస్తున్నారు.



కాప్రా సర్కిల్ మ్యాప్

తరలించాలని పోరాటం చేస్తుంటే..
కొత్త సమస్య..

నగరం నడిమధ్యలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని ఎన్నో ఏళ్లగా పోరాటం సాగిస్తుంటే.. ఇప్పుడు మళ్లీ కొత్తగా మేడ్చల్ నుంచి తీసుకొచ్చి ఇక్కడే వేస్తామంటే మేం ఉండ కూడదా.. అని వాపోతున్నారు.

కాలుష్యమయం..

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ఇప్పటికే గాలీ, నీరు, భూమి కాలుష్యమైంది. డంపింగ్ యార్డు పరిసరాల్లో నివసించే ప్రజలు దుర్వాసనతో శ్వాసకోశ సమస్యలు తలెత్తున్నాయి. కొద్దిపాటి వర్షం వచ్చిందంటే చాలు ఈ దుర్వాసన మరింత ఎక్కువవుతుంది. ఈ కాలుష్య సమస్యలతో తమ బతుకులు ఆగమైపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..



మేడ్చల్ పరిధిలోని అత్వెల్లి డంపింగ్ యార్డును జవహర్‌నగర్‌కు తరలించడం సరికాదు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు కనీసం అర కిలోమీటరు లోపే నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటికే దుర్వాసనతో జనం అవస్థలు పడుతున్నారు. తక్షణమే అత్వెల్లి డంపింగ్ యార్డును తరలించడాన్ని విరమించుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నాగిరెడ్డి సంజీవరెడ్డి, కాప్రా కాలనీల అధ్యక్షుడు

కాలుష్యకాసారాలను తలపిస్తోంది..



జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో సర్వం కాలుష్యమయమైపోయింది. యార్డు కారణంగా చిన్న గుంత తవ్వినా.. ఇందనం మాదిరిగా బయటకు వస్తోంది. సమీప కాలనీవాసుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా మేడ్చల్ అత్వెల్లి యార్డును తరలించడం, ఇక్కడి ప్రజల జీవితాలను పణంగా పెట్టడమే. ప్రభుత్వాలు మారుతున్నా.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడం లేదు. అత్వెల్లి యార్డు తరలింపును విరమించుకుని, నగరానికి దూరంగా డంపింగ్ యార్డులను తరలించాలి.

– పద్మారెడ్డి, చర్లపల్లి కాలనీల అధ్యక్షుడు

పవర్‌బోర్‌కు మరమ్మతులు.. ప్రారంభం



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని నల్లపోచమ్మ దేవాలమంలో చాలా ఏళ్లగా పవర్‌బోర్ పనిచేయలేదు. దీంతో దేవాలయ కమిటీ సభ్యులు గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన సొంత డబ్బులు రూ.35 వేలు సహకారం అందించారు. దీంతో కొత్త మోటర్, బోర్ వైరింగ్, పైపులను అమర్చి మరమ్మతులు చేపట్టారు. గురువారం ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పూజచేసి బోర్‌ను ప్రారంభించారు. అనంతరం దేవాలయ కమిటీ ప్రతినిధులు జంగం అశోక్, అశన్న, వాసు, బిక్షపతి సాయిజెన్‌శేఖర్‌ను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ : వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న, పెండింగ్, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షకాలంలో ముంపు ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాన్‌సూన్ టీమ్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎఫిరాక్'లో వేతన ఒప్పందం అమలుపై హర్షం



చెక్కును అందజేస్తున్న ఎఫిరాక్ ప్రతినిధులు

కుషాయిగూడ : చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎఫిరాక్ మైనింగ్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో వేతన ఒప్పందం అమలు చేయడంపై కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. 2024–27 ఆర్థిక సంవత్సరానికి సీఐటీయూతో జరిగిన వేతన ఒప్పందం సందర్భంగా ఒకే విడతలో రూ.19,500, అలవెన్స్‌లతో కలిపి రూ.21,000 సాధించుకోవడం సంతోషంగా ఉందని, సీఐటీయూ నేత జి. శ్రీనివాసులు అన్నారు. సీఐటీయూ కార్మికులకు అండగా చేస్తున్న పోరాట నిధిలో భాగంగా మేడ్చల్ జిల్లా కమిటీకి రూ.10 లక్షలు, రాష్ట్ర కమిటీకి రూ.10 లక్షల నిధులు అందజేయడం అభినందనీయమన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

కాప్రా : సాయిరాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదని వాపోతున్నారు. కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, వీధి లైట్లు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు విన్నవించారు. దీంతో సాయిరాంనగర్ పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. తక్షణమే సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ డీజీఎం సతీష్, ఏఈలు రోహిత్, అభిషేక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్ : నాచారం రాంరెడ్డినగర్ కాలనీలో రూ.10 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ పనుల అనంతరం సీసీరోడ్లు పూర్తిచేయిస్తానని హమీ ఇచ్చారు. కాలనీలో అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. జలమండలి మేనేజర్ వేణుగోపాల్, కాలనీవాసులు రాంరెడ్డి, మధుకర్‌రెడ్డి, నరసింహా, మధుసూదన్‌రెడ్డి, అక్రమ్, ప్రకాష్, వహీద్, రాజు, బీఆర్ఎస్ నేతలు పోగుల రమణారెడ్డి, భూపాల్‌రెడ్డి, విఠల్‌యాదవ్, రాంచందర్, కర్ణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం



హెచ్‌బీకాలనీలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు



ఓల్డ్ అల్వాల్‌లో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన దృశ్యం

ఉప్పల్ : ఎస్సీ వర్గీకరణ న్యాయ సమ్మతమైనదే నని అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును ఇవ్వడం చారిత్రాత్మకమని పలువురు నేతలు హర్షం వ్యక్తం చేసారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా ఉద్యమ ప్రస్తానాన్ని గుర్తించి, అందులోని సాంకేతిక అంశాలను పరిశోధించి చివరకు న్యాయస్థానం తీర్పునివ్వడంపై ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉప్పల్ కమాన్ వద్ద తోకట నరేష్ మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. హబ్సిగూడ చౌరస్తా వద్ద దుబ్బ గుడిసెల మల్లేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల కల సాకారమైంది..

కుషాయిగూడ : మాదిగల మూడు దశాబ్దాల కల సాకారమైందని, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎన్. భాగ్యమ్మ మాదిగ, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం జ్యోతి మాదిగ హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ సమర్థనీయమని పేర్కొంటూ.. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. గురువారం హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్‌లో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగ జాతిని ఏకం చేసి ఒక్కతాటిపై ఉద్యమించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చరిత్రలో నిలిచిపోతారన్నారు. అణగారిన వర్గాల పోరాటానికి న్యాయం జరిగిందంటూ.. స్వీట్లు తినిపించుకున్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొల్లూరి నాగయ్య, కత్తుల రాజ్‌కుమార్ మహిళా నాయకులు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది..

కాప్రా: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో న్యాయం గెలిచిందని కాంగ్రెస్ నేతలు సత్యనారాయణ, శ్రీకాంత్ అన్నారు. వర్గీకరణకు అనుమతిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాలకే అధికారాలను కేటాయిస్తూ.. సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కాప్రా గాంధీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం తీర్పుతో 50 ఏళ్ల కల నెరవేరిందన్నారు. వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారన్నారు. ఈ తీర్పుతో వర్గీకరణ అమలులో తమ రాష్ట్ర ప్రభుత్వమే ముందుంటుందని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొచ్చి వర్గీకరణ అమలు చేసి మాదిగ సోదరులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

30 ఏళ్ల కల నెరవేరింది..

అల్వాల్ : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఉప వర్గీకరణపై 30 ఏళ్లుగా ఏ.బి.సి.డి వర్గాలుగా విభజించాలని పోరాడుతున్న మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగా గురువారం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని సూర్యకిరణ్, శివకుమార్, ప్రభాకర్, ముత్యాలు అన్నారు. ఈ మేరకు గురువారం అల్వాల్ సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై 30 ఏళ్లుగా ఏ.బి.సి.డి వర్గాలుగా విభజించాలని పోరాడిన కల నెరవేరిందన్నారు. ఉప వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారం, ఉందని, కోటాలో సబ్ కోటా తప్పు కాదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్, ప్రకాష్, రాజు, లింగాల శంకర్, దయాకర్, గాయత్రి, బాలమల్లేష్, సత్యనారాయణ, భగవాన్, విష్ణు, బాలి, బాలకృష్ణ, మనోహర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రవి

మౌలాలి : సఫిల్‌గూడలోని డీఏవీ పాఠశాలలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రవి మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాల భారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో ప్రమాదాల భారిన పడకుండా ఉంటారన్నారు. ప్రిన్సిపాల్ శేషాద్రి, అడ్మినిస్ట్రేషన్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ఎంటమాలజీ సిబ్బందితో కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎంటమాలజి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్స్, ఫాగింగ్, డెంగీ కేసుల నియంత్రణ కార్యకలపాలకు సంబంధించిన విషయాలపై చర్చించారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి కోరగా.. ఈనెల మొదటి వారంలోపు తొలగింపు పనులను ప్రారంభిస్తామని చెప్పారన్నారు. ఏఎంహెచ్‌ఓ, ఎస్ఎస్‌లు తదితరులున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసనల వెల్లువ



సీఎం, డిప్యూటీ సీఎంల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : రామంతాపూర్ ప్రధాన రహదారి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో గురువారం కార్యకర్తలు, నేతలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. శాసనసభలో సీఎం, డిప్యూటీ సీఎంలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునితాలక్ష్మారెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వారికి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సర్వే ఆఫ్ ఇండియా చౌరస్తాలో..



ఉప్పల్ : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ.. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా చౌరస్తా వద్ద సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. మహిళా ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి మహిళా ఎమ్మెల్యేలను నిండు సభలో హేలన చేస్తూ మాట్లాడటంపై తీవ్రంగా మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి బేషరుతుగా క్షమాపణ చెప్పే వరకు ఆందోళనలు చేపడమని హెచ్చరించారు. బన్నాల ప్రవీణ్, వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



మల్కాజిగిరి చౌరస్తాలో..

మల్కాజిగిరి : మల్కాజిగిరి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత జెఏసీ వెంకన్న ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. మహిళా కార్పొరేటర్లు విజయశాంతిరెడ్డి, సబితాకిషోర్, మీనారెడ్డిలు మాట్లాడుతూ.. బాధ్యతగల ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సభలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తట్టుకోలేకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ మురుగేష్, జగదీష్‌గౌడ్, పరశురామిరెడ్డి, రాముయాదవ్, ఉపేందర్, బాబూరావు, కాటం రాజు, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.